# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 159. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.06.03.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## శిరీష కేసులో బిగ్ ట్విస్ట్.. చంపింది అతడు కాదు ఆమె

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: హైదరాబాద్‌లోని మలక్‌పేటలో వివాహిత శిరీష హత్య కేసు వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. శిరీష హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఏసీపీ శ్యాంసుందర్ తెలిపారు. ఈ కేసులో శిరీష భర్త వినయ్ కుమార్, అతని సోదరి సరిత, మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. మార్చి 1వ తేదీ రాత్రి వినయ్ సోదరి సరిత, శిరీష మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగిందని ఏసీపీ తెలిపారు. శిరీష నర్సుగా పని చేస్తోందని, పలుచోట్ల ఉద్యోగాలు మానేసిందని తెలిపారు. తరుచూ ఉద్యోగాలు మానివేస్తున్నందుకు సరిత నిలదీసింది. "నీ చరిత్ర మొత్తం నాకు తెలుసు. నీ సంగతి తేలుస్తా" అంటూ శిరీష కూడా ఎదురు దాడికి దిగిందని, దీంతో పరస్పరం ఘర్షణ దిగినట్లు తెలిపారు. ఘర్షణ తర్వాత కాసేపటికి, శిరీష తనకు నిద్రపట్టడం లేదంటూ సరిత వద్ద ఉంటే మత్తు ఇంజెక్షన్ అడిగి తీసుకుందని, శిరీష మీద కోపంతో డోసు ఎక్కువగా ఉన్న ఇంజెక్షన్ ఇచ్చిందని ఏసీపీ తెలిపారు.

## ఇండియాను హిందియా గా మార్చే యత్నం

చెన్నై :అమృత్ తెలంగాణ: త్రిభాషా విధానంపై కేంద్రంలోని మోడీ సర్కారుకు, తమిళనాడు ప్రభుత్వానికి మధ్య గత కొన్నేండ్లుగా వివాదం నడుస్తోంది. ఈ వివాదంపై తాజాగా 'మక్కల్ నీది మైయం (ఎంఎన్ఎం)' పార్టీ అధ్యక్షుడు, నటుడు కమల్ హాసన్ స్పందించారు. ఇండియాను 'హిందియా' గా మార్చే ప్రయత్నం జరుగుతోందంటూ ఆయన కేంద్రంపై విమర్శలు గుప్పించారు. అన్ని రాష్ట్రాలు హిందీలో మాట్లాడేలా చేసి, ఎన్నికల్లో మెజారిటీ సాధించాలని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మనందరం ఇండియా గురించి ఆలోచిస్తుంటే వారు మాత్రం హిందియా గురించి ఆలోచిస్తున్నారని కేంద్రంలోని బీజేపీ నేతలను ఉద్దేశించి అన్నారు. డీలిమిటేషన్, భాషా అంశాలపై బుధవారం తమిళ పార్టీలు సమావేశమ య్యాయి. ఈ సందర్భంగా ఆమోదించిన తీర్మానాన్ని కేంద్రానికి పంపాయి. 1971 జనాభా లెక్కల ప్రకారమే నియోజకవర్గాలపునర్విభజన చేపట్టాలనిఈ సందర్భంగా సీఎం స్టాలిన్ అభ్యర్థించారు. ఈ సమావేశంలోనే కమల్ హాసన్ మాట్లాడుతూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు.

# ఫీజుల మోత




అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులను వసూలు చేస్తున్నాయి. ట్యూషన్ ఫీజులే లక్షల్లో దండుకుంటున్నాయి. విద్యార్థులకు చదువుకునే పరిస్థితి నుంచి చదువుకొనే దుస్థితి దాపురించింది. హైదరాబాద్ నగరం ఐటీ, ఫార్మా రంగానికి హబ్‌గా ప్రఖ్యాతిగాంచింది. అదే సమయంలో ప్రయివేటు విద్యావ్యాపారానికి కూడా కేంద్రంగా ఉన్నది. ఎల్‌కేజీ చదువుకే ఏకంగా రూ.నాలుగు లక్షల వరకు ఫీజు వసూలు చేసే స్కూళ్లు హైదరాబాద్‌లో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. రాష్ట్రంలో బడ్జెట్, ప్రయివేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ అంటూ వివిధ కేటగిరీలుగా స్కూళ్లున్నాయి. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ వంటి సిలబస్‌ల పేరుతో అధిక ఫీజులను గుంజుతున్నాయి. ఏసీ తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ, ఆటస్థలం వంటి పేరు చెప్పి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. ఈ-టెక్నో, టెక్నో కరికులమ్, ఒలంపియాడ్, కాన్సెప్ట్ వంటి రకరకాల పేర్లతో అందిన కాడికి దోచుకుంటున్నా యి. పాఠశాల స్థాయిలోనే ఐఐటీ, నీట్ ఫౌండేషన్ చదువుల పేరుతో మోసం చేస్తున్నాయి. నర్సరీ (కిండర్‌గార్టెన్), ఎల్‌కేజీ (పీపీ-1), యూకేజీ (పీపీ-2) చదువులకే రూ.లక్షల ఫీజులను వసూలు చేస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్లు డొనేషన్ల పేరుతోనే రూ.30 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు తీసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రయివేటు బడుల్లో రూ.20 వేల నుంచి హైదరాబాద్ మహానగరంతోపాటు వరంగల్, కరీంనగర్ లాంటి పట్టణాల్లో రూ.ఐదు లక్షల వరకు ఫీజులను వసూలు చేస్తున్నాయి. రాష్ట్రంలో యధేచ్ఛగా విద్యావ్యాపారం సాగుతున్నది. ఫలితంగా చదువు ఖరీదైన సరుకై పోయింది. రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల మోత మోగిస్తున్నాయి. యాజమాన్యాలు ఉన్న ఫీజులను ఏటా 10 నుంచి 30 శాతం వరకు పెంచుతున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఒక ప్రయివేటు పాఠశాలలో రూ.80 వేల ఫీజు ఉంటే వచ్చే విద్యాసంవత్సరానికి దాన్ని పది శాతం చొప్పున రూ.88 వేలకు పెంచుతున్నట్టు సర్క్యులర్ జారీ చేసింది. మరో స్కూల్ యాజమాన్యం ప్రస్తుతం రూ.1.40 లక్షల ఫీజుంటే వచ్చే విద్యాసంవత్సరానికి 30 శాతం చొప్పున రూ.1.82 లక్షలకు పెంచుతున్నట్టు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. ఇలా రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు నిలువు దోపిడీ చేస్తున్నాయి. ఇంకోవైపు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫారాల పేరుతో అదనపు వడ్డింపులు కూడా భారీగానే వేస్తున్నాయి. రవాణా చార్జీల పేర మరింత పిండుకుంటున్నాయి. ఇలా చదువు పేరుతో వ్యాపారం చేస్తూ అడ్డూఅదుపు లేకుండా ఫీజులను పెంచుతూ తల్లిదండ్రులపై మోయలేని భారం మోపుతున్నాయి.

నిబంధనలకు తిలోదకాలు

రాష్ట్రంలో 11,454 ప్రయివేటు పాఠశాలలున్నాయి. వాటిలో 34.83 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. జీవో నెంబర్ 1 ప్రకారం ప్రతి ప్రయివేటు పాఠశాలలోనూ గవర్నింగ్ బాడీ ఉండాలి. ఫీజుల వివరాలను పాఠశాలల నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. వచ్చిన ఫీజుల్లో ఐదు శాతం మాత్రమే లాభాలు పొందాలి. ఫీజుల పేరుతో వచ్చే ఆదాయంలో 15 శాతం నిర్వహణ ఖర్చులు, 15 శాతం నిర్మాణాలు, స్థలం, ఫర్నీచర్, 50 శాతం వేతనాలు, 15 శాతం ఉపాధ్యాయుల గ్రాట్యూటీ, పీఎఫ్, బీమా తదితర వాటికి ఖర్చు చేయాలి. ఇన్ని నిబంధనలున్నా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు అమలు చేయడంలేదు. ఇంకోవైపు పుస్తకాల బరువుపైనా ఆంక్షలు విధిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో నెంబర్ 22ను జారీ చేసింది. అదీ అమలుకు నోచుకోవడం లేదు. ఇలా ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను యదేచ్ఛగా తుంగలో తొక్కుతున్నాయి. ఫీజుల నియంత్రణకు జిల్లా ఫీ రెగ్యులేటరీ కమిటీ (డీఎఫ్ఆర్‌సీ)ని ఏర్పాటు చేస్తూ 91 జీవోను 2009, ఆగస్టు 6న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసింది. దీనిపై తల్లిదండ్రులు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చింది. దీంతో 91 జీవోకు సడలింపునిస్తూ జీవో 3ని నాటి ప్రభుత్వం జారీ చేసింది. ప్రయివేటు పాఠశాలలు ఫీజు నియంత్రించాలనీ, క్యాపిటేషన్ ఫీజును రద్దు చేయాలనీ, కనీస ఫీజులను వసూలు చేయాలని అప్పటి ప్రభుత్వం 42 జీవోను 2010, జూలై 30న విడుదల చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. ఆ జీవోను హైకోర్టు కొట్టేసింది. దీంతో ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలకు అవకాశం దొరికింది. ఫీజుల నియంత్రణకు సరైన ఉత్తర్వులు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి : టి నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి

రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు యధేచ్ఛగా అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయి. ఏటా ఫీజులను పెంచుతూ భారాలు మోపుతున్నాయి. ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ లేదు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో ఫీజులను నియంత్రించడానికి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలి. ఇంటర్నేషనల్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ వంటి సిలబస్ పేరుతో ఫీజులను దండుకోవడంపై చర్యలు తీసుకోవాలి.

ఫీజుల నియంత్రణ చట్టం వచ్చేనా?

కార్పొరేట్ విద్యావ్యాపారాన్ని నియంత్రిస్తామని మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమ సమయంలో చెప్పినా అధికారంలోకి వచ్చాక అందుకోసం చర్యలు చేపట్టలేదు. కార్పొరేట్ విద్యావ్యాపారాన్ని ప్రోత్సహించారనే విమర్శ ఉన్నది. దీంతో అధిక ఫీజులను తగ్గించాలంటూ రాష్ట్రంలో పెద్దఎత్తున తల్లిదండ్రులు ఉద్యమించారు. స్పందించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తూతూమంత్రంగా తిరుపతిరావు నేతృత్వంలో కమిటీని వేసింది. ఆ కమిటీ నివేదిక ఇచ్చినా, సిఫారసులను అమలు చేయలేదు. అమలు పర్చకపోగా బహిరంగపర్చలేదు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఫీజులను నియంత్రించాలని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతున్నది. అందుకే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి నేతృత్వంలో విద్యాకమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో ఫీజుల కట్టడికి చట్టం చేయాలని ఆ కమిషన్ సిఫారసు చేసింది. ఫీజులను ఎలా కట్టడి చేయాలనే దానిపై పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతో సమాలోచన చేస్తున్నది. త్వరలోనే మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో ఉన్న మంత్రివర్గ ఉపసంఘానికి నివేదికను సమర్పించే అవకాశమున్నది. దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాతే ఫీజుల నియంత్రణపై స్పష్టత రానుంది. చట్టం వస్తుందా? లేదా?అనేది అప్పుడు తేలనుంది.

## నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం: వినోద్ కుమార్



హైదరాబాద్: అమృత్ తెలంగాణ:లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ సీనియర్ నేత వినోద్ కుమార్ అన్నారు. పునర్విభజన వల్ల కేవలం ఉత్తరాది రాష్ట్రాలు లాభపడతాయని ఆయన అన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఎంపీల స్థానాల విధానాన్నే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తే జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రమే లాభం జరుగుతుందన్నారు. కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల దక్షిణాది రాష్ట్రాలలో జనాభా సంఖ్య తక్కువగా ఉందని ఆయన అన్నారు. 1971 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని లోక్ సభ స్థానాలను నిర్ణయించారని, ఇదే పద్ధతిని కొనసాగించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా తప్పుబట్టారని ప్రస్తావించారు.

## బీఆర్ఎస్ పొరపాటు వల్ల రైతులకు ఇబ్బందులు వస్తున్నాయి : మంత్రి ఉత్తమ్



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: హరీశ్ రావు ఎందుకు మాట్లాడుతున్నాడో అసలు అర్థం కావడం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తాజాగా ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణా, గోదావరి జలాల్లో బీఆర్ఎస్ చేసిన పొరపాటు వల్ల రైతులకు ఇబ్బందులు వస్తున్నాయని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. హరీశ్ రావు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సూచించారు. ఖరీఫ్ లో ఉమ్మడి ఏపీ కంటే ఎక్కువ వరి తెలంగాణలో పండిందని తెలిపారు. ఇక రబీలో 56 లక్షల ఎకరాల పైగానే సాగు జరుగుతోంది. తక్కువ నీటిని సమర్థవంతంగా సాగు జరుగుతోంది. తక్కువ నీటిని సమర్థవంతంగా ఉపయోగిస్తున్నాం. ఏపీకి బీఆర్ఎస్ ధారాదత్తంగా నీటిని వదిలిపెట్టింది. మేము అధికారంలోకి వచ్చాక రూల్స్ మార్చాలని ఒత్తిడి తెచ్చామని తెలిపారు. అసలు హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్ నాం చేయాలని చూస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్, జగన్ విందు వినోదాలు చేసుకున్నారని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

## మంత్రి కొండా సురేఖపై సోనియా గాంధీ ప్రశంసలు..



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: తెలంగాణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రశంసించారు. దక్షిణ కాశీగా పేరొందిన తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆలయంలో 42 ఏళ్ల తర్వాత ప్రత్యేక చొరవతో సురేఖ మహా కుంభాభిషేకం నిర్వహించడమే ఇందుకు కారణం. కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించడం హర్షణీమంటూ మంత్రికి సోనియా లేఖ రాశారు. ఈ సందర్భంగా తనకు త్రివేణి సంగమం పవిత్ర జలాలను, ప్రసాదాన్ని పంపించినందుకు కొండా సురేఖకు లేఖ ద్వారా సోనియా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి స్థల విశిష్టతను, ప్రాశస్త్యాన్ని తెలియజేసినందుకు మంత్రిని అభినందించారు. కాగా, 1982లో తొలిసారి కాళేశ్వర, ముక్తీశ్వర ఆలయ జీర్ణోద్ధరణ జరిగిన సమయంలో ఇక్కడ మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత మళ్లీ 42 ఏళ్ల తర్వాత ఫిబ్రవరి 7 నుంచి 10వ తేదీ వరకు మహా కుంభాభిషేకం వేడుకలను నిర్వహించారు.

# ఓయూలో అందని ద్రాక్షలా సీపీఎస్



ఓయూ.అమృత్ తెలంగాణ: రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులకు సీపీఎస్ పద్ధతిలో పింఛన్ స్కీమ్ అమల్లో ఉంటే.. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో మాత్రం ఎల్ఐసీ లింకుడ్ పింఛన్ అమల్లో ఉంది. దీనిపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తమతోపాటు వివిధ శాఖల్లో పని చేస్తున్న వారికి సీపీఎస్.. వర్సిటీలో తమకేమో ఎల్ఐసీ లింకుడ్ పింఛన్ ఇవ్వడమేంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత డిసెంబర్ మాసంలో వర్సిటీలో నూతనంగా సుమారు 330 మందికిపైగా జూనియర్ అసిస్టెంట్లు విధుల్లో చేరారు. అయితే, వీరు ఎన్నో ఆశలు, ఆశయాలతో యూనివర్సిటీలోకి అడుగు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎస్ అమలైనా ఓయూలో మాత్రం ఎల్ఐసీ లింకుడ్ పింఛన్ ఉండటంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్టయ్యింది.

రాష్ట్ర ప్రభుత్వం సుమారు 8 వేల మంది ఉద్యోగులను టీజీపీఎస్సీ గ్రూప్ 4 ద్వారా ఎంపిక చేసింది. వీరిలో కొందరు ఓయూలో జాబ్ చేసేందుకు ఆప్షన్ ఎంచుకున్నారు. మరికొందరు రాష్ట్ర ప్రభుత్వంలోని పలు శాఖల్లో విధుల్లో చేరారు. అయితే, ఓయూలో విధుల్లోకి చేరిన జూనియర్ అసిస్టెంట్స్‌కు మాత్రం యూనివర్సిటీలో అమల్లో ఉన్న ఎల్ఐసీ లింకుడ్ పింఛన్ ఇవ్వనున్నట్టు అపాయింట్‌మెంట్ ఆర్డర్లలో జత పరిచారు. ఇది నూతనంగా జాయిన్ అయిన ఉద్యోగులకు తీవ్రంగా నిరాశ కలిగించింది. అందరూ ఒకేసారి టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైనా కొందరికి సీపీఎస్.. ఇంకొందరికి ఎల్ఐసీ లింకుడ్ పింఛన్ రావడం విచిత్రంగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తమతో పాటు నియమితులై వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల మాదిరిగా తమకూ సీపీఎస్ అమలు చేయాలని ఓయూ జూనియర్ అసిస్టెంట్స్ ఇప్పటికే యూనివర్సిటీ ఉన్నతాధికారులు, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ఫైనాన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

వేచి చూస్తున్న ఓయూ ప్రొఫెసర్లు, ఉద్యోగులు..

2001 ఏప్రిల్ నుంచి ఓయూలో నియామకమైన బోధన, బోధనేతర ఉద్యోగులకు ఎల్ఐసీ లింకుడ్ పింఛన్ ఇస్తున్నారు. 2004 సెప్టెంబర్ 1న అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ అమలు చేసింది. కానీ ఓయూలో అది అమలుకు నోచుకోలేదు. ఓయూలో ఉద్యోగులు కూడా సీపీఎస్ అమలు చేయాలని కొన్నేండ్లుగా ఉద్యమిస్తూ వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో సీపీఎస్ అమలు చేస్తూ ఒక్క ఓయూలోనే ఇలా ఉండటంపై ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. పలుమార్లు యూనివర్సిటీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఎస్ అనుమతి కోసం లేఖలు రాసినా ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో వారు నిరాశతో ఉన్నారు.

## తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి సీతక్క, జానారెడ్డి



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై స్పందించిన జానారెడ్డి కొంతమంది బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకలై మాట్లాడుతున్నారంటూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై మంత్రి సీతక్క విమర్శలు గుప్పించారు. ఈరోజు తీన్మార్ మల్లన్న మీడియా సమావేశం నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆయన వ్యాఖ్యలకు సీతక్క కౌంటర్ ఇచ్చారు. కులగణనపై అభ్యంతరాలు ఉండి ఉంటే శాసనమండలిలో మాట్లాడవచ్చని సూచించారు. బీఆర్ఎస్ చేయలేనిది తమ ప్రభుత్వం చేసినందుకు అభినందించాల్సింది పోయి విమర్శించడం సరికాదని ఆమె అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతో అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. కులగణనకు 50 రోజుల సమయం ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి మాట్లాడుతూ గాలి మాటలు మాట్లాడితే కుదరదని చెప్పారు. తప్పు చేసిన వాడిని కూడా క్షమించే గుణం తనదని తనను తిట్టినా పట్టించుకోనని అన్నారు. ప్రత్యక్ష రాజకీయాలకు తాను దూరంగా ఉన్నానని పాలన చేసే వారు అడిగితేనే తాను సలహాలు ఇస్తానని చెప్పారు. కులగణన అంశంలో తన పాత్ర లేదని తెలిపారు. మరో సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న అంశంతో తనకు సంబంధం లేదని చెప్పారు. ఆ అంశాన్ని పార్టీ నాయకత్వం చూసుకుంటుందని అన్నారు. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ కు చెప్పానని తెలిపారు.

## తెలంగాణ ప్రాజెక్టులకు అనుకూలమని లేఖలు రాయాలి

సిద్దిపేట : అమృత్ తెలంగాణ: తెలంగాణ ప్రాజెక్టులను తాను ఎప్పుడూ అడ్డుకోలేదని చెబుతున్న ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు.. గోదావరి జలాలపై తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టులకు అనుకూలమని కేంద్రానికి, సీడబ్ల్యూసీకి లేఖలు రాయాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. గోదావరి జలాలపై నిర్మిస్తున్న సమ్మక్క సాగర్, సీతమ్మ సాగర్, వార్ధా ప్రాజెక్టు, కాళేశ్వరం మూడో టీఎంసీ నిర్మాణాలకు తాము అనుకూలంగా ఉన్నామని, పాలమూరు -ఎత్తిపోతలు, దిండి ఎత్తిపోతలకు, కల్వకుర్తికి 40 టీఎంసీల నీటి కేటాయింపునకు అనుకూలమని చెప్పాలని చంద్రబాబును కోరారు. కానీ, 2018 జూన్ 13న అప్పుడు ఏపీ సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు కాళేశ్వరం ప్రాజెక్టును ఆపాలని, అనుమతులు నిలిపివేయాలని కేంద్రానికి లేఖ రాసినట్టు గుర్తు చేశారు. 2016 ఏప్రిల్ 24న పాలమూరు, దిండి ఎత్తిపోతల పథకాన్ని నిరసిస్తూ అప్పటి కేంద్ర మంత్రి ఉమాభారతికి స్వయంగా లేఖ రాశారని, అదే సంవత్సరం ఫిబ్రవరి 8న కూడా పాలమూరు, దిండి, కల్వకుర్తి ఎత్తిపోతలకు నిరసనగా లేఖలు రాశారని తెలిపారు. తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా డజన్ల కొద్ది లేఖలను చంద్రబాబు నాయుడు కేంద్రానికి పంపించారన్నారు.

బీజేపీ అండతో నీటి దోపిడీ : ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీల నీటిని తీసుకోవాల్సి ఉండగా ఇప్పటివరకు 657 టీఎంసీల నీటిని తీసుకుపోయారని, తెలంగాణకు 314 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ 220 టీఎంసీలు మాత్రమే వాడుకున్నట్టు హరీశ్‌రావు తెలిపారు. అక్రమంగా నీటిని తరలించుకు పోవడం వల్ల తెలంగాణలో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అనేక డీపీఆర్‌లు వాపస్ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ఏట్రైకర్ చైర్మన్ డాక్టర్. తేజవత్ బెల్లయ్య నాయక్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కోటా లో ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి



అమృత్ తెలంగాణ ఖానాపూర్ న్యూస్ : కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడైన ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ఏట్రైకర్ చైర్మన్ డాక్టర్. తేజవత్ బేల్లయ్య నాయక్ గారికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ తెలిపారు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం లంబాడి సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ ఉ ద్యమకారుడు స్వరాష్ట్రం కోసం అహర్నిశలు కృషిచేసి తెలంగాణ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసినటువంటి వ్యక్తికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే కోటాలో డాక్టర్ బేల్లయ్య నాయక్ ఎమ్మెల్సీ పదవీ బాధ్యతలు ఇచ్చి వారి గౌరవానికి తోడ్పడాలని తెలిపారు

# భవిష్యత్తు భాజపా దే



ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలవడంతో ఎమ్మెల్యే పాయల్ శంకర్ కు స్వీట్ తినిపిస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం పక్కన ఉప్కం రఘుపతి మరియు కార్యకర్తలు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్తు బీజేపీ దే నని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారులి రాష్ట్రఅధ్యక్షుడు కిషన్ రెడ్డి నాయకత్వంలో అసెంబ్లీ ఎన్నికల తో పాటు మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 8 స్థానాలను కైవసం చేసుకోవడంలో కిషన్ రెడ్డి పాత్ర అభినందనీయమన్నారు ఆయన చేసిన దశ దిశ నిర్దేశంతో పాటు కార్యకర్తలు శ్రమించడంతో ఉపాధ్యాయ పట్టభద్రులా ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారని ఆయన అన్నారు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉపాధ్యాయుల సమస్యలపై 317 పై చేసిన పోరాట ఫలితంగా ఉపాధ్యాయ సోదరులు భాజాపాకు మద్దతుగా నిలిచి గెలిపించాలని ఆయన అన్నారు రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో భాజపా ప్రభుత్వము ఏర్పడుతుందన దానికి నిదర్శనమే నేటి ఫలితాలు అని అన్నారు..

## గాంధీ భవన్‌లో జరిగిన పార్లమెంట్ స్థాయి సమావేశంలో పాల్గొన్న కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ హైదరాబాద్ న్యూస్ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ మీనాక్షి నటరాజన్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి అవగాహన కల్పించాలన్నారు. అన్ని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేసి



హైదరాబాదులో గాంధీభవన్లో సమావేశంలో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు సాధించడం ప్రధాన లక్ష్యంగా పని చేయాలని నాయకత్వం దిశానిర్దేశం చేసింది. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌చార్జ్ పెరుమాళ్ విశ్వనాథన్, వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు ఇన్‌చార్జ్‌లు, అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలంతా బిజెపి వైపు ఉన్నారు

## రానున్నది రామ రాజ్యమే...ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ప్రజలంతా బిజెపి వైపు ఉన్నారని, ఇక రాష్ట్రంలో రానున్నది రామరాజ్యమేనని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు వ్యతిరేకిస్తున్నారనడానికి నిదర్శనం ఎమ్మెల్సీ ఎన్నికలేనన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో రెండు స్థానాలు బిజెపి కైవసం చేసుకోవడం శుభసూచకమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారన్నారు..ఇక రాష్టం లో రానున్నది రామరాజ్యమని వచ్చే ఎన్నికల్లో రాష్టం లో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి కి ఓటు వేసిన పట్టభద్రులకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం ముథోల్ నియోజకవర్గంభారీ మెజార్టీ రావడం తో ప్రజలంతా కాషాయం వైపే ఉన్నారనడానికి నిదర్శనం అన్నారు. ఎమ్మెల్సీ



ఎన్నికల్లో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు, నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

# గాంధీ భవన్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లోక్ సభనియోజకవర్గ సమీక్షా సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఓబీసీ జిల్లా అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ అంబకంటి అశోక్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ గాంధీ భవన్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లోక్ సభనియోజకవర్గ సమీక్షా సమావేశం ఏర్పాటు చేయనైనది ఈ సమావేశంలో గత ను అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రాబోయే రోజులలో చేపట్టబోయే ప్రణాళికలను ముందస్తుగా తయారు చేసుకుని అందరి అభిప్రాయాల



సేకరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయించనైనది,ఇందులో కాంగ్రెస్ నాయకులు ఏ ఐ సి సి సభ్యులు %ణతీ%. నరేష్ జాదవ్ ఓబీసీ జిల్లా అధ్యక్షులు (కౌన్సిలర్) అంబకంటి అశోక్ ,మాజీ జడ్పీటీసీ లు నర్సయ్య,గణేష్ రెడ్డి,ఆదిలాబాద్ మండల అధ్యక్షులు సంజయ్ దుబె,యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు మొహమ్మద్ నహీద్,మాజీ కౌన్సిలర్ అశోక్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు కాలిపోయిన ఇల్లు





కాళీ బూడిదైన ఇల్లు దృశ్యం

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చ్ 5 అమృత తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని బూరుపల్లి జి గ్రామంలో రాథోడ్ దినేష్, ఇంట్లో ఒక్కసారి మంటలు చెలరేగినాయి అంతలోనే మంటలు ఇల్లు మొత్తం వ్యాపించినాయి దినేష్ ఇరుగుపొరుగు వారి సాయంతో మంటలు ఆర్పేలోపు ఇల్లు మొత్తం మరియు ఇంట్లో గల సామాగ్రి మొత్తం ఖాళీ బూడిదైనది. ఇంట్లో కాలి బూడిదైనా వస్తువుల విలువ మొత్తం అందాజా 4 లక్షల 50వేల వరకు ఉంటుందని రాథోడ్ దినేష్, ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిరణ్, కేసు నమోదు చేసి విచారణ చేపట్టినారు.

# నర్సాపూర్ జి పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు



మిస్సయిన మారుతి ఫైల్ ఫోటో

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చ్ 5 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన రాథోడ్ మారుతి 44 గత పది రోజుల క్రితం ఇంట్లో నుండి వెళ్ళిపోయినాడని, అప్పటినుండి తన ఆచూకీ గురించి మారుతి కుటుంబ సభ్యులు వారి బంధువుల ఇళ్లలో మరియు చుట్టుపక్కల గ్రామాలలో వెతికిన తన జాడ తెలియకపోయేసరికి బుధవారం రోజు మారుతి భార్య రాథోడ్ అరుణ, పోలీస్ స్టేషన్ లో తన భర్త ఆచూకీ తెలుసుకొనుటకై దరఖాస్తు ఇవ్వగా ఎస్సై సాయి కిరణ్, కేసు నమోదు చేసి విచారణ చేపట్టినారు.

# ఖాతాదారులకు గోల్డ్ లోన్ తిప్పలు




నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చ్ 5 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ లో బ్యాంక్ ఖాతాదారులకు గోల్డ్ లోన్ తిప్పలు తప్పట్లేదని వాపోతున్నారు. గోల్డ్ లోన్ కొరకు దరఖాస్తుదారుడు రుణ దరఖాస్తు ప్రక్రియ సులభం ,రుణ ఆమోదం చెల్లింపులు వెంటనే జరుగుతాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ లో వెళితే రెండు రోజులు సమయం పడుతుందని ఖాతాదారులు వాపోతున్నారు. ఇదే విషయమై బ్రాంచ్ మేనేజర్ వివరణ కోరగా తమ శాఖలో గోల్డ్ లోన్ ఇచ్చే క్యాషియర్, ఖాతాదారులకు నగదు అందించే క్యాషియర్ ఒకే లాగిన్ ఉండడంతో రోజుకు 10 చొప్పున అందజేస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా బ్యాంక్ సిబ్బంది స్పందించి నర్సాపూర్ జి , దిలావర్పూర్, కుంటాల మండల ఖాతాదారులకు ఒకే బ్యాంక్ ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. గోల్డ్ లోన్ కొరకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందని ఖాతాదారులు అంటున్నారు

## ప్రత్యేక వైకల్య గుర్తింపు (సదరం) కార్డుల జారీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బుధవారం సాయంత్రం ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యుడిఐడి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కోసం మీసేవ కేంద్రాలను ఆశ్రయించేవారని, ఇప్పుడు మీసేవలతో పాటు యుడిఐడి పోర్టల్ , స్వంత మొబైల్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్, స్లాట్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. క్యాంపుల వివరాలు కూడా మెసేజ్ ల ద్వారా తెలియజేయడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల నుంచే అమల్లోకి తీసుకురావడం జరిగిందని, 21 రకాల వైకల్యం కలిగిన వారు యుడిఐడి ( యూనిక్ డిజేబిలిటీ ఐడి ) కార్డును పొందవచ్చని ఆమె తెలిపారు. సదరం కార్డును పోస్టల్ ద్వారా సంబంధిత



వ్యక్తులకు చేరవేయడం జరుగుతుం దన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్నవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, వారికి ప్రస్తుతం ప్రభుత్వపరంగా అందుతున్న పథకాలు వర్తిస్తాయని ఆమె పేర్కొన్నారు. దివ్యాంగులు ఎలాంటి అపోహలకు గురికాకుండా వారికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు జారీ చేసే క్రమంలో వైద్య బృందానికి అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బంది తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గోపాల్, సునీల్, సురేష్, డిపిఎం శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

## బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డిగ్రీ విద్యార్థినులతో ఇంటరాక్ట్ అయిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.






అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బేటి బచావో బేటి పడావో కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఆవశ్యకత తెలియజేసేందుకై జిల్లాలోని పలువురు డిగ్రీ విద్యార్థినులతో బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ విద్యార్థినుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలికలు ఉన్నత విద్యను చదివి జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని తెలిపారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ప్రారంభమై 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున జనవరి 22వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు 45 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు, తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ హెల్ప్ లైన్ నంబర్లు 100, 1098,181, 1930 లు, బాల్య వివాహ నిర్మూలన చట్టం-2006, బాలికలు, మహిళల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పరిపాలన విధానం, భవిష్యత్తు ప్రణాళిక, మహిళా సాధికారత ,బేటి బచావో బేటి పడావో యొక్క ప్రాముఖ్యత, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎసిడిపిఓ నాగలక్ష్మి, మిషన్ శక్తి సమన్వయకర్త సవిత, మిషన్ శక్తి బృంద సభ్యులు, విద్యార్థినులు, అధ్యాపకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గృహ, వాణిజ్య పన్ను వసూలు, శానిటేషన్ తదితర అంశాలపై మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాలలో వాణిజ్య, గృహ పన్నుల వసూలును వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సకాలంలో పన్నులు చెల్లించని వారికి చట్ట ప్రకారం రెడ్ నోటీసులు జారీ చేయాలనీ సూచించారు. ఇప్పటివరకు వసూలు చేసిన పన్నులు, బకాయిలకు సంబంధించి మున్సిపాలిటీల వారీగా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా త్వరితగతిన పన్ను వసూలు పూర్తి చేయాలన్నారు. పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారస్తులు తప్పనిసరిగా వాణిజ్య లైసెన్సులను పునరుద్ధరించుకునేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ




భవన సముదయాలలో వ్యాపారం నిర్వహించుకుంటున్న వ్యాపారస్తుల నుంచి అద్దెలు వసూలు చేయాలన్నారు. బకాయిలు పేరుకుపోయిన దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సూచించారు ఈ సమావేశంలో నిర్మల్, బైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, రాజేష్ కుమార్, జాదవ్ కృష్ణ లు మెప్మా పీడీ సుభాష్, శానిటరీ ఇన్స్ పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఎదుగుదలకు చేయూతను అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు.






అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల వేడుకలలో భాగంగా మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ప్రారంభమై 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 22 నుంచి మార్చి 8 వరకు 45 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలలో విద్యార్థులకు మహిళ విద్య ఆవశ్యకత, మహిళా సాధికారిత, బాలికలు, మహిళల హక్కులు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు, తదితర అంశాలపై అవగాహనను పెంపొందించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే మహిళ సంక్షేమ అధికారులంతా సమాజంలో బాలికలకు, మహిళలకు ఇబ్బందులు కలిగితే వెంటనే రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆడపిల్లలు కుటుంబానికి భారం కాదని, నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాలలో రాణించగలుగుతున్నారని తెలిపారు. 100, 1098,181, 1930 హెల్ప్ లైన్ నంబర్ల పై బాలికలు, మహిళలు పరిజ్ఞానం కలిగి ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. దేశాభివృద్ధిలో మహిళలంతా కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అనంతరం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి (జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్) జి. రాధిక మాట్లాడుతూ, మహిళలకు సంబంధించిన హక్కులు, చట్టాలపై మరింత విస్తృత అవగాహన పెంపొందించాలన్నారు. మహిళలందరికీ న్యాయపరమైన సహాయాన్ని అందిస్తామని తెలిపారు. బాలికలు, మహిళల్లో బాల్య వివాహ నిర్మూలన చట్టం-2006 గురించి చైతన్యం కలిగించాలన్నారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్, సీనియర్సివిల్ జడ్జి, అధికారులతో కలిసి బేటి బచావో బేటి పడావో ప్రతిజ్ఞ చేసి, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎసిడిపిఓ నాగమణి, డీఎంహెచ్ రాజేందర్, ఏఎన్ఎం ఆశాలు, మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లా కేంద్రంలోని శాంతి నగర్ ప్రభుత్వ బాల, బాలికల జూనియర్ కళాశాలలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరీక్షల తొలిరోజు అయిన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.హాపరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? లేదా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏ.ఎన్,ఎం, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరశురాం, తదితరులు ఉన్నారు.

## బుధవారం జిల్లా పాలనాధికారి రాజర్షి షా కలెక్టరేట్ సమావేశ మందిరం లో మెడికల్ ఆఫీసర్ లతో కేజీబీవీ, మోడల్, వెల్ఫేర్ హాస్టల్స్ , స్కూల్స్ విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ హెల్త్ ప్రొఫైల్ తయారీ, వారానికి ఒకసారి విద్యార్థులకు అందిస్తున్న ఐరన్ ఫోలిక్ మాత్రలు, వంద రోజుల టీబీ క్యాంప్ లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.





అమృత తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ జిల్లాలోని kgbv, మోడల్,అన్ని వెల్ఫేర్ , గురుకుల స్కూల్స్, హాస్టల్స్ విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలనీ మెడికల్ ఆఫీసర్ లను ఆదేశించారు. ఈ నెల 7 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు అన్ని సంక్షేమ హాస్టల్స్ , స్కూల్స్ విద్యార్థులకు rbsk టీమ్ ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు చేయాలనీ, రక్త పరీక్షలు తప్పనిసరిగా చేయాలనీ చేయాలనీ అన్నారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులను మినహాయించి , మిగితా విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ చేయాలనీ, పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు అయిన తరువాత వారికి పరీక్ష లు నిర్వహించడం జరుగుతుందని అన్నారు . విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షల వలన వారి నేర్పు, ఆరోగ్యం, మానసిక పరిస్థితులను తెలుసుకొని మెరుగైన వైద్యం అందించవచ్చని అన్నారు. ప్రతీ గురువారం విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలని అందుకు wifs యాప్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని, 5 సంవత్సరాల నుండి 10 సంవత్సరాల పిల్లలకు పింక్ కలర్ మాత్రలు, 10 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల పిల్లలకు బ్లూ కలర్ మాత్రలు ప్రతీ గురువారం మధ్యాహ్నం భోజనం అనంతరం అందించాలని అన్నారు. వందరోజుల టిబి కార్యక్రమం లో భాగంగా టిబి పేషెంట్లకు పోషకాహారం ప్రతీ నెల అందించుటకు ఫుడ్ బాక్స్ లను నిక్షయ మిత్ర ద్వారా అందించడం జరుగుతుందని, జిల్లా లో గ్లాండ్ ఫార్మా కంపెనీ ఫుడ్ బాక్స్ లు అందించుటకు ముందుకు వచ్చారని, అందుకు జిల్లాలోని ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో టిబి పేషంట్ల వివరాల ప్రణాళికను సిద్ధం చేయాలనీ, త్వరలోనే ఈ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులకు సక్రమంగా హాజరు కావాలని అన్నారు. వేసవి దృష్ట్యా ఆశ వర్కర్స్ దగ్గర ORS ప్యాకెట్స్ అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, DMHO నరేందర్, మెడికల్ ఆఫీసర్ లు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

## ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి నేషనల్ అకాడమీ కన్స్ట్రక్షన్ ద్వారా మేస్త్రీ లకు జిల్లా పరిషత్ కార్యాలయం లో ఇస్తున్న శిక్షణలో భాగంగా బుధవారం జిల్లా పాలనాధికారి రాజర్షి షా పాల్గొని మేస్త్రీలకు కిట్ లను పంపిణీ చేశారు.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన నేషనల్ అకాడమీ కన్స్ట్రక్షన్ ద్వారా గత సోమవారం నుండి వారం రోజుల పాటు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం లో ప్రతీ మండలం నుండి ఇద్దరు మెస్త్రీలకు ఇస్తున్న శిక్షణలో భాగంగా బుదవారం జిల్లా పాలనాధికారి రాజర్షి షా సందర్శించి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు నాణ్యత ప్రమాణాలు పాటించి కట్టడానికి సిద్ధంగా ఉండేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇళ్లు కట్టడం లో మేస్త్రీల ప్రాముఖ్యత చాలా ముఖ్యం అన్నారు. గత సోమవారం నుండి మూడు రోజుల పాటు ఇస్తున్న శిక్షణలో మార్కౌట్ , ఇటుక కు సంబంధించి , తదితర వాటిపై న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు 17 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నాణ్యత ప్రమాణాలు పాటించి ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు, మేస్త్రీ ల సహకారం తో కంప్లీట్ చేయడానికి అందరూ సిద్ధంగా ఉండాలని అన్నారు.

అంతకు ముందు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల పై సంబంధిత మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 17 మండలాల్లోని 17 గ్రామపంచాయితీలలో ఎంపికైన 2148 ఇండ్లకు మార్కింగ్ ను వేగవంతం పూర్తి చేయాలన్నారు. మిగిలిన అన్ని గ్రామాలలోని ఇండ్లకు సంబందించిన వెరిఫికేషన్ ప్రక్రియను మార్చ్ 7 లోగా పూర్తిచేసి నివేదిక సమర్పించాలన్నారు. 15 మంది అమరవీరుల కుటుంబాల అభిప్రాయం సేకరించగా, వారి అభిప్రాయం మేరకు ముత్నూర్ గ్రామా పంచాయితీ పరిధిలో నివాస స్థలాలను కేటాయించడం జరిగిందని, అట్టి నివాస స్థలాల అభివృద్ధి పనులకు సంబందించిన ఎస్టిమేట్ ను సిద్ధం చేయాలని పీడీ హౌసింగ్ ను ఆదేశించారు.




అలాగే స్వంత గ్రామాల్లో ఇల్లు కట్టుకోవాలనుకునే వారి జాబితాను ఎంపీడీఓ లు సిద్ధం చేయాలనీ ఆదేశించారు. విద్యుత్, త్రాగునీటి సౌకర్యం సత్వరం కల్పించాలని సంబంధిత ఎఅధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి ఉన్న ఏడు క్రిటికల్ మండలాలు అయిన అదిలాబాద్ రూరల్, బజార్ హత్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, నార్నూర్, సిరికొండ, ఉట్నూర్ లలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ జితేందర్, హౌసింగ్ పీడీ , ఎంపిడిఓ లు, పంచాయితి సెక్రటరీ లు, తదితరులు పాల్గొన్నారు.

## మొదటిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం..



ఆసిఫాబాద్ :అమృత్ తెలంగాణ: ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిస్తాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు పరీక్ష జరగగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 19 సెంటర్లలో పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు.

మొదటిరోజు 95శాతం హాజరు

ఇంటర్మీడియట్ పరీక్షలకు మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 95.11శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కళ్యాణి తెలిపారు. మొదటి సంవత్సరం మొత్తం 5076 మంది విద్యార్థులు ఉండగా, వీరిలో జనరల్ విద్యార్థులు 4283 మంది, ఒకేషనల్ విద్యార్థులు 793 ఉండగా, జనరల్ విద్యార్థులు 4100 మంది, ఒకేషనల్ విద్యార్థులు 728 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలకు 248 మంది గైర్హాజర్ కాగా, వీరిలో 183 మంది జనరల్ విద్యార్థులు, 65 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు.

సెంటర్లు తనిఖీ చేసిన జిల్లా అధికారు

ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాల సెంటర్ ను జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే పరిశీలించగా, పిటిజి కళాశాల సెంటర్ ను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని కళ్యాణిలు సందర్శించి అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కాకుండా చూడాలని ఆదేశించారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాలతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా కేంద్రాల్లోని గిరిజన బాలుర కళాశాలలో ఏర్పాటుచేసిన సెంటర్ ను జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, స్థానిక సీఐ రవీందర్ తో పాటు, టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తో కలిసి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను లోనికి పంపించేటప్పుడు తనిఖీ చేసి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకుండా చూడాలన్నారు పరీక్ష కేంద్రాల వద్ద బిఎన్ఎస్ఎస్ 163 అమల్లో ఉంటుందని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలే లక్ష్యం..



ఆసిఫాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సరైన విధంగా అమలు చేయడమే తమ లక్ష్యమని దీనికోసం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కలెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా కలెక్టర్ ఛాంబర్ లో డిపిఆర్ఓ సంపత్ ఆధ్వర్యంలో పాత్రికేయులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ చూపడం జరుగుతుందన్నారు. వసతిగృహాల్లో రాత్రి బసచేయడం వల్ల విద్యార్థుల మంచి చెడులు తెలుసుకోవడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. జిల్లాలో నీటిసమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో జనవరి మాసం నుండి ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. వేసవిలో విద్యుత్ సమస్య లేకుండా ముందస్తు కార్యాచరణలో భాగంగా ట్రాన్స్ఫార్మర్లు మార్చడంతో పాటు విద్యుత్తు లైన్లను సరిచేయడం జరుగుతుందని తెలిపారు. ఏడాదికాలం పాటు జిల్లాలో పనిచేయడం వల్ల ఈ ప్రాంతంలో ఎంతో నేర్చుకోవడం జరిగిందని రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంతో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలో అందించేందుకు సంబంధిత శాఖల ద్వారా లక్ష్యాలను చేరవేసేందుకు తగు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికలకు సంబంధించిన పాత్రికేయులు పాల్గొన్నారు.

## బాలికల సమగ్ర అభివృద్ధికి కృషి..



ఆసిఫాబాద్ :అమృత్ తెలంగాణ: బాలికల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఇదే సందర్భంలో బాలికలు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని అవి సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా మహిళా, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మహిళా సాధికారిక కేంద్రం సమన్వయకర్త శారద అధ్యక్షతన నిర్వహించిన భేటీ బచావో-భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే చదువులో రాణించాలని తెలిపారు. విద్యార్థినిలు యుక్త వయసు సమయంలో మరింత శుభ్రత పాటించాలని, శరీరం దృఢంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ఏకాగ్రత ఉంటుందని, క్రీడారంగంలో సైతం రాణించాలని తెలిపారు. బాలికలను కాపాడుకోవడం, చదివించుకోవడం తో పాటు వారికి స్వేచ్ఛగా అన్ని రంగాలలో తోడ్పాటు అందించాలని తెలిపారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 10వ తేదీ వరకు జిల్లాలోని 40 ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలలో ప్రత్యేక బృందం ద్వారా ప్రేరణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించే దిశగా ప్రజలందరూ స్వచ్ఛందంగా సహకరించాలని, బాలికల చదువు కుటుంబానికి, దేశానికి ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ. నలంద, సుండిల్ల రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన..

ఆసిఫాబాద్ :అమృత్ తెలంగాణ: తాగునీటి కోసం గిరిజనులు ఖాళీ బిందెలతో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆదివాసి సంఘాల నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రజా సంఘాల నాయకులు దుర్గం దినకర్, టీకానంద్, రాజేందర్, కృష్ణమాచారి, మాలశ్రీలు మాట్లాడుతూ.. జిల్లాలోని వాంకిడి మండలం అనోలి గ్రామానికి గత కొంతకాలంగా తాగునీరు సరఫరా కావడం లేదని గతంలో అదనపు కలెక్టర్ దృష్టికి, కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోవడంతో నిరసన తెలుపుతున్నట్లు వివరించారు. వేసవికాలం ప్రారంభం కాకముందే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం




అమృత్ తెలంగాణ: పొన్నూరు: మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పొన్నూరు కు చెందిన చింతం శ్రీనివాసరావు సహకారంతో నిడుబ్రోలు ఓవర్ బ్రిడ్జి పైన ఉన్న పేదవారికి అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్ మాట్లాడుతూ ఆకలిని తీర్చడం గొప్ప మనసున్న వ్యక్తి చింతం శ్రీనివాస్ ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరించిన చింతం శ్రీనివాస్ కి ఉమాశంకర్ కృతజ్ఞతలు తెలియజేశారు ప్రతి ఒక్కరూ అన్నదాన కార్యక్రమాలు చేసి తోటి వారికి సహాయం చేయగలరని కోరారు మేము చేసే కార్యక్రమాల్లో మీరు కూడా భాగస్వాములు అవుతారని అన్నారు

ఈ కార్యక్రమంలో ట్రెజరీ చిలకపాటి సింహాద్రి ఈసీ నెంబర్ పోలిశెట్టి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు అన్నదానం రక్తదానం చేయాలని అనుకున్న వాళ్లు సంప్రదించండి 8333089722.

# ఐసిడిఎస్ వారి హెల్త్ ఉమెన్ - హ్యాపీ ఉమెన్ ప్రోగ్రాం

పలమనేరు (చిత్తూరు) : అమృత్ తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఉత్తర్వులు, కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ వారి ఆదేశాల మేరకు మార్చి, 8 న జరుగు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా "హెల్త్ ఉమెన్ – హ్యాపీ ఉమెన్ " ఐసిడిఎస్ సిబ్బంది పలమనేరు పురపాలక సంఘ హెల్త్ సెక్రెటరీలతో గర్భవతులు తీసుకొనవలసిన జాగ్రత్తలు, బాలింతలకు పౌష్టిక ఆహారము తీసుకోనుటలో చిరుధాన్యాలు, యోగా పై అవగాహన కల్పించి వారికి పౌష్టిక ఆహారము కిట్ ను సరఫరా చేయడము జరిగినది, గర్భవతులు మరియు బాలింతలు తీసుకొనవలసిన పౌష్టికాహారమును ప్రదర్శించి అవగాహన కల్పించడము జరిగినది. పై కార్యక్రమము నందు కమీషనర్ రమణా రెడ్డి , సిడిపిఒ అధికారి ఇందిరా ప్రియదర్శిని , ఐడిసిఎస్ సూపర్ వైజర్లు నజీమ గారు, మాధవిలతా , ద్రాక్షాయిణి , మునిసిపల్ మేనేజర్ ఎస్ఎం ఖాదర్ మొహిద్దీన్ , మెప్మా డిపార్టుమెంటు సిఎంఎం బాబా , పురపాలక సంఘ హెల్త్ సెక్రెటరీలు తదితరులు పాల్గనడము జరిగినది. మరియు పలమనేరు పురపాలక సంఘ పరిధిలో పాస్టిక్ వాడకము నివారణ చర్యలలో భాగంగా పురపాలక సంఘ శానిటరీ ఇన్స్పెక్టర్ వారు, శానిటేషన్ సెక్రెటరీలు, టాస్క్ ఫోర్సు, వార్డు మహిళా సెక్రెటరీలు, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు మరియు పురపాలక సంఘ సిబ్బంది పట్టణము లోని పలు దుకాణములపై ఆకస్మిక తనిఖీలు జరిప్ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్



బ్యాగ్ లు సీజ్ చేసి ప్లాస్టిక్ వినియోగము వల్ల వచ్చు నష్టాలను వివరించి వాటి స్థానములో గుడ్డ సంచులు, జ్యూట్ సంచులు నివియోగించవలసినదిగా దుకాణదారులకు మరియు ప్రజలకు అవగాహన కల్పించడము జరిగినది. తదుపరి ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బ్యాగ్ లు వినియోగించినా లేదా అమ్మకము జరిపినా జరిమానా విధించి మరియు చట్టపరమైన చర్యలు గైకొనబడునని తెలియజేయడమైనది.

# భానుడి భగభగ



రాజమహేంద్రవరం :అమృత్ తెలంగాణ: వేసవి పూర్తిగా రాకముందే జిల్లాలో ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. గడిచిన రెండు వారాలుగా రోజురోజుకు భానుడు భగభగమంటున్నాడు. ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎండల తీవ్రత ప్రారంభమైంది. మార్చినాటికి ఇవి మరింత ముదిరాయి. ఇక ఎలా ఉండబోతోందనే జనం బెంబేలెత్తుతున్నారు. మరో పక్క రాత్రి వేళలో పొద్దుపోయిన తర్వాత చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ విచిత్ర వాతావరణంలో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు వివిధ రోగాల బారిన పడుతున్నారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువ ఉంటాయనే వాతావరణ హెచ్చ రికలతో మరింత ఆందోళన పెరిగింది. 36 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. మొదటి వారంలోనే పలుప్రాంతాల్లో 38 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో పక్క ఉక్కపోత ప్రజలను కుదురుగా ఉండనీయట్లేదు. జిల్లాలో ఎండల తీవ్రత పెరగడంతో ఎసిలు, కూలర్ల వినియోగం పెరిగింది. చాలా మంది తమ ఇళ్లలో ఉన్న ఎసిలకు సర్వీసింగ్ చేయిస్తున్నారు. వీటితో పాటు కూలర్లు కూడా రిపేరు చేయించుకుంటున్నారు. అలాగే ఎత్తయిన భవనాల్లో ఉండేవాళ్లు కూల్ పేయింట్లను వేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. గ్రామాల్లో కూడా జనం ఇళ్లపైన ఆరుబయట పడుకోవటం ఆరంభించారు. మార్చి చివర నాటికి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది ఇదే సమాయానికి ఇంత ఎండలేదని ఈ సారి భానుడు భగభగమంటున్నాడని ప్రజలు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఉక్కిరి బిక్కిరి ఈ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. దీంతో మధ్యాహ్నం విద్యార్థులు తిరుగు ప్రయాణంలో అవస్థలు పడుతున్నారు. అలాగే ఈ నెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. బాగా ఎండల తీవ్రత పెరుగుతున్న సమయంలో పరీక్షలు ప్రారంభం కావటంతో పిల్లలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పరీక్షలు ఉదయమే ప్రారంభం అవుతాయి కనుక ఎండ తీవ్రత కొద్దిగా తక్కువ ఉన్నా పరీక్ష ముగిసే సమయానికి మాత్రం ఎండలు అదరగొట్టే అవకాశం ఉంటుంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పరీక్షలకు సిద్ధమవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

## చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం

తడ (తిరుపతి) :అమృత్ తెలంగాణ: తడ మండలంలోని మాంబట్టు గ్రామం అపాచీకు వెళ్లే రోడ్డు ప్రక్కన వున్న చెరువులో బుధవారం ఉదయం గుర్తు తెలియని మహిళ మృతదేహంను గుర్తించి బయటకు తీశారు. ఈ మృతదేహం సుమారుగా నాలుగు రోజుల నుండి ఐదు రోజులుగా చెరువు నీటిలో ఉంటునట్లుగా పోలీసు వారు అంచనా వేస్తున్నారు. ఈ మృతదేహం ను ముందుగా అక్కడే ఉన్న పందులను మెపుకునే వారు తమ పంది ఒకటి కనిపించడం లేదని వెతుకుతున్న సమయంలో వారికి చెరువు నీటి లో మృతదేహం తేలుతూ దుర్వాసన వస్తుండడంతో భయపడి పోలీసు వారికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసు వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తాడు సాయంతో బయటకు తీసారు. మృతదేహం పురుగులు పట్టి దుర్వాసన వస్తుంది.బట్టలను బట్టి మృతదేహం మహిళ దిగా గుర్తించారు.


# మృణాల్.. పస లేని పార్టీ!



సినిమాల్లో సీరియస్ రోల్స్, ఎమోషనల్ క్యారెక్టర్స్ పోషించే మృణాళ్ ఠాకూర్ రియల్ లైఫ్‌లో మాత్రం పూర్తి భిన్నంగా ఉంటుంది. సినిమాల్లో సీరియస్ రోల్స్, ఎమోషనల్ క్యారెక్టర్స్ పోషించే మృణాళ్ ఠాకూర్ రియల్ లైఫ్‌లో మాత్రం పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎప్పుడూ ఉల్లాసంగా, నవ్వుతూ, ఫుల్ ఎనర్జీతో కనిపించే ఆమె సోషల్ మీడియాలోనూ అదే ఎటిట్యూడ్‌ను కొనసాగిస్తుంటుంది. ఇక ఈమధ్య కెరీర్ పరంగా వేగం తగ్గినా సరే బాలీవుడ్ లో మళ్ళీ బిజీ అయ్యే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుతం ఆమె అజయ్ దేవగన్ హీరోగా తెరకెక్కుతున్న సన్ ఆఫ్ సరదార్ 2లో కూడా నటిస్తోంది. ఈ సినిమా భారీ అంచనాల మధ్య తెరకెక్కుతుండగా, మృణాళ్ క్యారెక్టర్‌కు మంచి స్కోప్ ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం రెండు ఇండస్ట్రీల్లోనూ ఎంటర్టైనింగ్, పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్స్ ఎంచుకుంటూ కెరీర్‌లో నెక్స్ట్ లెవల్‌కి వెళ్లేందుకు ఆమె సిద్ధమవుతోంది. ప్రసన్న కుమార్ బెజవాడ ఇక పర్సనల్ లైఫ్ లో ఆమె ఎంజాయ్ చేసే విధానం ఎలా ఉంటుందో ఇటీవలే తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సరదా వీడియో ద్వారా తెలిపింది. వీడియో షేర్ చేస్తూ, 'హిట్టు పాటకి ఫ్లాప్ షో' అనే క్యాప్షన్‌తో తన ఫాలోవర్లను నవ్వించింది. మృణాళ్ తన టీమ్‌తో కలిసి కార్‌లో ట్రావెల్ చేస్తూ ధనుష్ పాపులర్ సాంగ్ 'వై దిస్ కోలేవెరి' పాటను సరదాగా ఆలపించింది. షూటింగ్ ముగిసిన తర్వాత తమకు ప్యాక్ అప్ డాన్స్ చేసే అవకాశం రాలేదని, అందుకే కార్‌లోనే మజా చేసుకున్నామని చెప్పింది అసలు మ్యాటర్ ఏంటంటే! సింపుల్ కానీ ఫన్నీ వీడియో కావడంతో నెటిజన్లు కూడా దీన్ని తెగ ఎంజాయ్ చేస్తున్నారు. ఇక సోషల్ మీడియాలో వీడియోపై భిన్నమైన కామెంట్స్ వస్తున్నాయి. పాపం పస లేని పార్టీలో మృణాల్ అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇక కేవలం సరదా వీడియోలే కాదు, ఇటీవల మృణాళ్ తన సోషల్ మీడియా అకౌంట్స్ ద్వారా పలు ఇంట్రెస్టింగ్ ఫోటోలు షేర్ చేసింది. కేవలం లుక్‌తోనే కాదు, మృణాళ్ ఆరోగ్యంపై, పర్సనల్ కేర్‌పై కూడా చాలా కేర్ తీసుకుంటుంది. గతేడాది డెంగ్యూ రావడంతో భారీగా హెయిర్ ఫాల్ సమస్య ఎదుర్కొన్నానని ఇటీవల షేర్ చేసింది. కానీ సరైన ట్రీట్మెంట్, న్యూట్రీషన్ మెయింటెయిన్ చేయడంతో ఇప్పుడు కొత్తగా తల వెంట్రుకలు పెరుగుతున్నాయని ఆనందం వ్యక్తం చేసింది.

# 'మాస్' కోసం 'ఫ్యామిలీ' త్యాగం.. నాని కరెక్టేనా?


మాస్‌లో మాత్రం రీచ్ తక్కువగా ఉండేది. చాలా ఏళ్ల పాటు ఇదే అభిప్రాయం కొనసాగింది. కానీ గత కొన్నేళ్లలో నాని మేకోవర్ కోసం గట్టి ప్రయత్నమే చేస్తున్నాడు. నేచురల్ స్టార్ నానికి ఎప్పుడో స్టార్ ఇమేజ్ వచ్చినా.. అతను పక్కా క్లాస్ అనే ముద్రే పడిపోయింది. తనకు ఫ్యామిలీస్‌లో, క్లాస్ అభిమానుల్లో మంచి ఫాలోయింగ్ వచ్చినా.. మాస్‌లో మాత్రం రీచ్ తక్కువగా ఉండేది. చాలా ఏళ్ల పాటు ఇదే అభిప్రాయం కొనసాగింది. కానీ గత కొన్నేళ్లలో నాని మేకోవర్ కోసం గట్టి ప్రయత్నమే చేస్తున్నాడు. 'ఎంసీఏ'లో అతడికి మాస్ ఎలివేషన్లు పడ్డాయి. ఫైట్లు కూడా కొంచెం గట్టిగానే చేశాడు. ఆ తర్వాత 'దసరా'తో నాని పెద్ద షాకే ఇచ్చాడు. అందులో నాని క్యారెక్టరైజేషన్, డైలాగ్స్, లుక్ అన్నీ కూడా మారిపోయాయి. నేచురల్ స్టార్‌ను అంత మాస్‌గా అప్పటిదాకా ఎవ్వరూ చూపించలేదు. నాని చిత్రంలో అంత వయొలెన్స్ ఉండడం కూడా ఆశ్చర్యానికి గురి చేసింది. మాస్‌లో నానికి ఆ సినిమా రీచ్ పెంచింది. అదే సమయంలో ఫ్యామిలీ ఆడియన్స్ ఆ సినిమాను ఆశించిన స్థాయిలో చూడలేదనే చర్చ



కూడా జరిగింది. ఐతే 'హాయ్ నాన్న'తో వాళ్లకు కావాల్సింది ఇచ్చేశాడు నాని ప్రసన్న కుమార్ బెజవాడ 'సరిపోదా శనివారం' ఇటు మాస్, అటు క్లాస్ ఆడియన్స్‌కు నచ్చింది. ఫ్యామిలీ ఆడియన్స్‌కు కూడా అది ఓకే అనిపించింది. కానీ ఇటీవల రిలీజైన నాని కొత్త చిత్రాల ప్రోమోలు మాత్రం ఫ్యామిలీ ఆడియన్స్‌ను కంగారెత్తించేశాయి. 'హిట్–3'లో వయొలెన్స్ చూసి వామ్మో అనుకున్నారు ఫ్యామిలీ ఆడియన్స్. ఇంత వయొలెన్స్ భరించలేం అనుకున్నారు ఆ వర్గం. ఇక లేటెస్ట్‌గా వచ్చిన 'ది ప్యారడైజ్' సినిమాలో బూతు డైలాగులకు ఆ వర్గం బెంబేలెత్తిపోయింది. బూతులను నార్మలైజ్ చేయడం గురించి ఇప్పుడు పెద్ద చర్చే జరుగుతోంది. టీజర్లనే ఇలాంటి బూతులు పెడితే.. ఇక సినిమా ఎలా ఉంటుందో.. ఫ్యామిలీ ఆఢియెన్స్ ఎలా థియేటర్లకు వచ్చి ఈ సినిమా చూడగలరో అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంకెవరి సినిమాలోనో ఇలా ఉంటే ఏమో కానీ.. నాని లాంటి ఫ్యామిలీస్ మెచ్చే హీరో చిత్రం ఇంత ఘాటుగా ఉండడం ఏంటి అంటున్నారు. ఐతే బోల్డ్ కంటెంట్‌కు బాగా అలవాట పడ్డ ఈ తరం యువతకు, మాస్‌కు ఈ టీజర్ బాగానే ఎక్కేసింది. వాళ్లు టీజర్ చూసి ఊగిపోతున్నారు. కానీ మాస్‌లో రీచ్ కోసం నాని ఫ్యామిలీ ఆడియన్స్‌ను దూరం చేసుకుంటున్నాడని, ఇది కరెక్ట్ కాదనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

# కయదు వీడియోస్ ట్రెండ్ చేస్తున్నారుగా..!

ఆ సినిమా చూసిన తమిళ ఆడియన్స్ ఆమె గురించి ఆహా ఓహో అనేస్తుంటే తెలుగు ఆడియన్స్ కూడా అమ్మడిని తెగ ఫాలో అవుతున్నారు. ప్రదీప్ రంగనాథన్ తో డ్రాగన్ సినిమాలో నటించిన కయదు లోహార్ కు ఆ సినిమాతో సూపర్ పాపులారిటీ వచ్చింది. సినిమాలో అనుపమ పరమేశ్వరన్ కూడా ఒక హీరోయిన్ కాగా ఆమె కన్నా కయదు యూత్ ఆడియన్స్ కు దగ్గరైంది. ముఖ్యంగా సినిమాలో ఆమె గ్లామర్ లుక్స్, యాక్టింగ్ అంతా నచ్చేసింది. డ్రాగన్ సినిమాతో కయదు లోహార్ సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమా చూసిన తమిళ ఆడియన్స్ ఆమె గురించి ఆహా ఓహో అనేస్తుంటే తెలుగు ఆడియన్స్ కూడా అమ్మడిని తెగ ఫాలో అవుతున్నారు. ప్రసన్న కుమార్ బెజవాడ ఐతే కయదు లోహార్ ఆల్రెడీ తెలుగులో 3 ఏళ్ల క్రితమే ఒక సినిమా చేసింది. శ్రీ విష్ణు చేసిన అల్లూరి సినిమాలో అమ్మడు హీరోయిన్ గా నటించింది. ఐతే ఆ సినిమా పెద్దగా ఆడకపోవడంతో ఆ టైం లో ఆమెను ఎవరు పట్టించుకోలేదు. కానీ డ్రాగన్ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో ఇప్పుడు అల్లూరి సినిమా క్లిప్స్, సాంగ్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. డ్రాగన్ చూశాక ఆమెను మరింత ట్రెండ్ చేస్తున్నారు. తెలుగు సోషల్ మీడియాలో కయదు లోహార్ ఒక ట్రెండింగ్ టాపిక్ గా మారింది. అమ్మడి గురించి ప్రత్యేకమైన చర్చలు జరుపుతున్నారు. ఇక కయదుకి ఆఫర్లు కూడా వరుస కడుతున్నాయి. ఇప్పటికే అనుదీప్, విశ్వక్ సేన్ కాంబో సినిమా ఫంకీలో అమ్మడు ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. ఈ సినిమాతో పాటు మరో రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని తెలుస్తుంది. కయదు కూడా తెలుగు ఆడియన్స్ తనపై చూపిస్తున్న ఈ ప్రేమకు సూపర్ హ్యాపీగా ఉంది. తెలుగులో ఒక్కసారి క్లిక్ అయితే ఆ హీరోయిన్ కి స్టార్ రేంజ్ వచ్చినట్టే లెక్క. తెలుగులో స్టార్ స్టేటస్ వస్తే మిగతా అన్ని భాషల్లో కూడా అదే రేంజ్ ఆఫర్లు



## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# నభా నటేష్.. హీటెక్కిస్తున్న గ్లామర్ ట్రీట్



తాజాగా ఆమె పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫొటోలు నెటిజన్ల మతిపోగొడుతున్నాయి. ఇందులో నభా తన బోల్డ్ లుక్స్‌తో అందర్నీ ఫిదా చేసేసింది. టాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ నభా నటేష్ తన స్టైల్ స్టేట్మెంట్‌తో మరోసారి ఫ్యాన్స్‌ను మెస్మరైజ్ చేసింది. సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉంటుందో, అదే స్థాయిలో తన స్టన్నింగ్ ఫోటోషూట్‌లను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫొటోలు నెటిజన్ల మతిపోగొడుతున్నాయి. ఇందులో నభా తన బోల్డ్ లుక్స్‌తో అందర్నీ ఫిదా చేసేసింది. స్టన్నింగ్ లుక్స్‌తో ఆమె పోస్ట్ చేసిన ఈ ఫోటోషూట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. బ్లాక్ కలర్ కెల్విన్ క్లీన్ బ్రా, లూజ్ బేజీ షర్ట్, మ్యాచింగ్ ట్రౌజర్స్‌లో నభా తన గ్లామర్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్లింది. ఒంటి మీద కవర్ చేసుకునేలా ఒక క్యాజువల్ లుక్ ఇచ్చినప్పటికీ, తన ఎక్స్‌ప్రెషన్స్‌తో సోషల్ మీడియాలో హీటెక్కిస్తోంది. మరీ ముఖ్యంగా ఈ లుక్స్‌లో నభా మోడ్రన్ యాంగిల్‌లో కొత్తగా కనిపించడం అభిమానులకు మజానే అందిస్తోంది. ప్రసన్న కుమార్ బెజవాడ ఈ ఫోటోలను షేర్ చేస్తూ, నభా "మార్చి అంటే ఫిబ్రవరి మాత్రమే, మంచి లైటింగ్ ఉంటే!" అంటూ క్యాప్షన్ జత చేసింది. ఈ క్యాప్షన్ ఆమె ఫోటోషూట్‌కు ఎంత కష్టపడ్డారో చెప్పకనే చెబుతోంది. నెటిజన్లు ఆమె లుక్స్‌పై ఫిదా అవుతూ కామెంట్స్ వర్షం కురిపిస్తున్నారు. టాలీవుడ్‌లో నభా గ్లామర్‌కు ఓ రేంజ్ ఉంది, బోల్డ్‌నెస్‌కీ, క్లాస్‌కీ మిక్స్ నువ్వే.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే, నభా ప్రస్తుతం 'స్వయంభు' సినిమాలో నిఖిల్‌కు జోడిగా నటిస్తోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com